క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): భవానీపురం పరిధిలోని 11 కేవీ భవానీపురం ఫీడర్ విద్యుత్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా కొన్ని ప్రాంతాల్లో రెండు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బీవీ సుధాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు మానవ మందిరం రోడ్డు, స్వాతి రోడ్డు, పోపూరివారి వీధి, ఎంఎస్ దాస్ వీధి, హనుమయ్య వీధి, గుడివాడ రామారావు వీధి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదు.

3 నుంచి విజయదుర్గ గుడిలో దసరా ఉత్సవాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భీమనవారి పేటలోని విజయదుర్గ రామలింగేశ్వరస్వామి ఆలయంలో అక్టోబర్ 3 నుంచి 12వ తేదీ వరకు దసరా ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు చింతలపాటి వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి పేర్కొన్నారు. 3వ తేదీ గురువారం ఉదయం గణపతి పూజ, కలశ స్థాపనతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. 3వ తేదీ శ్రీవిజయదుర్గాదేవిగా, 4న శ్రీగాయత్రిదేవిగా, 5న శ్రీఅన్నపూర్ణాదేవిగా, 6న శ్రీలలితాత్రిపురసుందరీదేవిగా, 7న శ్రీపార్వతిదేవిగా, 8న మహాలక్ష్మీదేవిగా, 9న మూల నక్షత్రం శ్రీసరస్వతిదేవిగా, 10న శ్రీదుర్గాదేవిగా, 11న మహిషాసురమర్ధిని దేవిగా, 12న రాజరాజేశ్వరిదేవిగా అమ్మవారికి విశేషంగా అలంకరిస్తారని పేర్కొన్నారు. ఉత్సవాల నేపథ్యంలో ప్రతి రోజూ ఆలయ ప్రాంగణంలో విశేష కుంకుమార్చన జరుగుతుందని తెలిపారు. 12వ తేదీ ఉదయం చండీహోమం, పూర్ణాహుతి, రాత్రి 8 గంటలకు శమీపూజతో ఉత్సవాలు ముగుస్తాయని పేర్కొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో ఆధ్యాత్మిక ప్రవచనం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలోని ధర్మపథం వేదికపై మంగళవారం ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ పురాణ పండిత్ వెంకటేశ్వరశాస్త్రి ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ ప్రాశస్త్యం, ఆలయ విశేషాలను చక్కటి వ్యాఖ్యానంతో భక్తులకు వివరించారు. అనంతరం వెంకటేశ్వరశాస్త్రిని ఆలయ అధికారులు సత్కరించి, ప్రసాదాలను అందజేశారు.

విజయ పాల ఫ్యాక్టరీకి రూ.లక్ష విరాళం



హనుమాన్‌జంక్షన్ రూరల్: బుడమేరు వరదతో ముంపునకు గురైన విజయవాడలోని కృష్ణా మిల్క్ యూనియన్ ప్రధాన పాల ఉత్పత్తుల కార్మాగారం మరమ్మతుల నిమిత్తం చిట్యాల, వీరవల్లి పాల సొసైటీల తరుపున రూ.లక్ష విరాళాన్ని అందించారు. బాపులపాడు మండలం వీరవల్లిలోని ప్రాజెక్టు కామధేను ఫ్యాక్టరీలో కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులను కలిసి రూ. లక్ష చెక్కును అందజేశారు. ముందుచూపుతో గతేడాది వీరవల్లిలో కొత్తగా అత్యాధునిక ఆటోమేషన్ సదుపాయాలతో ప్రాజెక్టు కామధేను ఫ్యాక్టరీ నిర్మించటం వల్ల ఇలాంటి విపత్కర పరిస్థితుల్లోనూ పాల సేకరణ, సరఫరాలో ఎలాంటి ఆటంకం లేకుండా నిర్వహించటం చైర్మన్ చలసాని పాలనా సమర్థతకు నిదర్శనమని కొనియాడారు. చిట్యాల, వీరవల్లి పాల సొసైటీ అధ్యక్షులు బి.సుశీల, కసుకుర్తి నిరంజనరావు, యూనియన్ ఎండీ కొల్లి ఈశ్వర బాబు పాల్గొన్నారు.

వరద బాధితులకు అపోలో వైద్యుడి సాయం

సాక్షి, అమరావతి: వరద బాధితులకు హైదరాబాద్‌లోని అపోలో ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ జె.జయప్రకాశ్ సాయి తన నెల వేతనంలో రూ.లక్ష సాయంగా అందించారు. ఆ మొత్తాన్ని ముఖ్యమంత్రి సహాయ నిధికి జమ చేశారు. ఇటీవల వచ్చిన వరదలు ఏపీలో లెక్కలేనన్ని కుటుంబాలను అతలాకుతలం చేశాయని ఆవేదన వ్యక్తం చేశారు.

రూ.లక్ష విరాళం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ సొసైటీ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయ నిధికి రూ. లక్ష విరాళం అందజేసినట్లు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జి.లక్ష్మీనారాయణ, పి.వెంకట్ తెలిపారు.

'స్ఫూర్తి సభ'లను ప్రభుత్వం నిర్వహించాలి

విజయవాడ కల్చరల్: తెలుగు సినీ దిగ్గజాల స్ఫూర్తి సభలను భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో ప్రభుత్వం నిర్వహించాలని మహానటి సావిత్రి కళాపీఠం వ్యవస్థాపకురాలు పరచూరి విజయలక్ష్మి కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కళాపీఠం ఆధ్వర్యాన సంస్థ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. విజయలక్ష్మి మాట్లాడుతూ తెలుగు సినీ పరిశ్రమ ఉన్నతికి ఎందరో కృషి చేశారని వారిలో అక్కినేని, నందమూరి, కృష్ణ, శోభన్ బాబుతదితరులు కనిపిస్తారని పేర్కొన్నారు. వారి శత జయంతులు, వర్ధంతులను ప్రభుత్వం నిర్వహించాలని కోరారు.

నీరు తగ్గినా.. కోలుకోని ప్రజలు

- కష్టాలు మొదలయ్యాయి
- నష్టాన్ని చూసి బోరుమంటున్న ప్రజానీకం
- ఏ ప్రాంతంలో చూసినా ఇదే దుస్థితి



పాత హెచ్‌బీ కాలనీలో తడిసిపోయిన వస్తువులు బయటపెడుతున్న స్థానికులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వరద తెరిపిచ్చినా.. ప్రజలు కోలుకునే పరిస్థితులు కానరావడం లేదు. గడిచిన పది రోజులుగా వరద నీరు నగరాన్ని అతలాకుతలం చేసి ఇప్పుడిప్పుడే వెనక్కు తగ్గినా ప్రజల జీవితాలు ఇంకా గాడిలో పడలేదు. చాలా ప్రాంతాల్లో బుడమేరు వరద నీరు వెనక్కు మళ్లింది. అయితే కొన్ని పల్లపు ప్రాంతాల్లో ఇంకా బుడమేరు నీటితో పాటుగా మురుగునీరు కలిసి తిష్ట వేశాయి. ఇవి స్థానికులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. నగరంలోని దాదాపుగా అన్ని ప్రాంతాల్లోనూ ఇవే పరిస్థితులు కొనసాగుతున్నాయి. పాతరాజరాజేశ్వరిపేట, వించిపేట, కేఎల్‌రావునగర్, కబేళా, ఊర్మిళానగర్ ప్రాంతాలన్నింటిలోనూ ఇటువంటి పరిస్థితులు స్థానిక ప్రజలను భయకంపితులను చేస్తున్నాయి.

తల్లడిల్లిపోతున్నారు

ఇంటి నుంచి వరద నీరు బయటకు వెళ్లిన తర్వాత లోపల పరిస్థితులను చూసి ప్రజలు బోరుమంటున్నారు. ఇంట్లో ఉన్న సామగ్రిని బయటకు తీసి చూసి తల్లడిల్లిపోతున్నారు. ఇంట్లో ఉన్న ఫ్రిజ్, మంచాలు, ఇతర సామగ్రి పూర్తిగా దెబ్బతినడంతో ప్రతి ఇంటా రూ.50 వేల నుంచి లక్షల్లో నష్టం వాటిల్లిందని ప్రజలు బోరుమంటున్నారు. ద్విచక్ర వాహనాల పరిస్థితి సరేసరి. ప్రధానంగా రోజువారి వేతన జీవులు, చిరు ఉద్యోగులు అధికంగా ఉన్న ఆయా ప్రాంతాల్లో ప్రతి ఇంటా వరద నష్టం చోటు చేసుకుంది. దాంతో వారి పరిస్థితులు దారుణంగా మారాయి. ఇంత నష్టం జరిగితే మమ్మల్ని పట్టించుకునే వారు కరువయ్యారని వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకూ ప్రభుత్వం నుంచి స్పష్టమైన భరోసా రాలేదంటూ ఆయా ప్రాంత వాసులు వాపోతున్నారు.

ప్రభుత్వ సాయంలోనూ గందరగోళం

ప్రభుత్వం అందించే సాయంలోనూ గందరగోళ పరిస్థితులు చోటు చేసుకున్నాయి. రేషన్ సరుకులు పంపిణీ చోట తప్పనిసరిగా రేషన్‌కార్డు కావాలని పట్టుబట్టడంతో అది ఎక్కడో నీటిలో కొట్టుకుపోయిందని ప్రజలు చెబుతున్నారు. వేలిముద్ర ఆధారంగా ఈపోస్ యంత్రాల ద్వారా పంపిణీ చేయాలని చెబుతున్నా కొంతమంది అడ్డంకి చెబుతున్నారు. సబ్సిడీ కూరగాయల విషయంలోనూ అరకొరగా విక్రయాలు జరిపి అక్కడి నుంచి వెళ్లిపోతున్నారంటూ స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు. దానికితోడు ప్రతి ఇంటికి వచ్చి ఫైరింజన్లు మీ ఇళ్లు కడుగుతాయంటూ ప్రభుత్వం ప్రకటించినా వారు సైతం అరకొరగానే పనులు చేసి వెనుతిరిగారని ఆ ప్రాంత ప్రజలు చెబుతున్నారు.



ఊర్మిళానగర్‌లో చెత్త తీస్తున్న సిబ్బంది



చిట్టినగర్‌లో నిత్యావసరాలు తీసుకోవడానికి భారీ క్యూ



జక్కంపూడి కాలనీలో పాడైనపోయిన బియ్యం

తక్షణమే పరిహారం అందించండి

మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు



ఊర్మిళానగర్‌లో వరద బాధితులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వరద బాధితులకు తక్షణమే పరిహారం అందించాలని మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుడమేరు వరద ముంపునకు గురైన ఊర్మిళానగర్‌లో మంగళవారం మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా పర్యటించారు. ప్రతి ఒక్కరితో మాట్లాడి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఒక్కొక్కరినీ పలకరిస్తూ జరిగిన నష్టం వివరాలు తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని బాధితులకు సూచించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ వరద ప్రభావంతో ఊర్మిళానగర్ వాసులకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. ఒక్కో ఇంట్లో లక్షల రూపాయల నష్టం సంభవించిందని తెలిపారు. విద్యార్థుల సర్టిఫికెట్లు, పుస్తకాలు పూర్తిగా వరద నీటికి తడిసిపోయాయని, ప్రభుత్వం వాటిపై కూడా దృష్టి సారించాలని కోరారు. విద్యార్థులకు పుస్తకాలు, సర్టిఫికెట్లు జారీ చేయడానికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. నిత్యావసర సరుకుల కోసం ప్రజలు రోడ్ల మీద పడిగాపులు కాస్తున్నారన్నారు. వారికి నిత్యావసరాలను ఇంటి వద్ద అందించడానికి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వరద ముంపునకు గురైన ప్రాంతాల్లో శానిటేషన్ చేయడంలో అధికార యంత్రాంగం, ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని తెలిపారు. వరద నీరు ఇప్పటికీ రోడ్ల మీద, ఇళ్లలోనూ నిలిచిపోయాయని తక్షణమే మోటార్లు ఏర్పాటు చేసి లోతట్టు ప్రాంతంలో నిలిచిన వరద నీటిని తొలగించాలన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలకు విషజ్వరాలు, అంటురోగాలు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ ధ్యాన చంద్రను కోరారు. ఆయనతో ఫోన్‌లో మాట్లాడి సమస్య తీవ్రతను వివరించారు. వరద ముంపు ప్రాంతాల్లో సత్వరమే నష్టం అంచనాలు రూపొందించి బాధితులకు పరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. వెలంపల్లి శ్రీనివాసరావు వెంట కార్పొరేటర్ బాపతి కోటిరెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

వరద నీటిని ఇళ్ల మధ్యకు వదులుతున్నారు

- బొమ్మసాని సుబ్బారావునగర్‌వాసుల ఆందోళన
- మా ఇళ్ల మధ్య ఉన్న నీరు తోడాలని సిబ్బందితో వాగ్వివాదం



మున్సిపల్ సిబ్బంది వద్ద ఆందోళన వ్యక్తం చేస్తున్న మహిళలు



ఊర్మిళానగర్‌లో తోడిన నీటితో జలమయమైన బొమ్మసాని సుబ్బారావునగర్

భవానీపురం(విజయవాడపశ్చిమ): బుడమేరు వరద ముంపునకు గురైన ఊర్మిళానగర్‌లో ఇంకా ఉన్న నీటిని వీఎంసీ సిబ్బంది ఐదు మోటర్లను ఏర్పాటు చేసి రోడ్డుకు మరో వైపు (గొల్లపూడి పంచాయతీ) ఉన్న బొమ్మసాని సుబ్బారావునగర్‌లో ఇళ్ల మధ్యకు వదలడంపై మహిళలు ఆందోళన చెందారు. ఊర్మిళానగర్ మెయిన్ రోడ్ చివర (కబేళా వెళ్లే) మలుపులో ఉన్న కల్వర్ట్ వద్ద ఐదు ఎలక్ట్రికల్ మోటార్లను పెట్టి వరద నీటిని తోడుతున్నారు. వాటిని కల్వర్ట్‌కు రెండవ వైపు ఉన్న బొమ్మసాని సుబ్బారావునగర్‌లోని నివాసాల మధ్యకు మళ్లించటంతో కొంత మేర తగ్గుముఖం పట్టినా నీళ్లు మళ్లీ పెరిగిపోయాయి. దాంతో నివాసితులు రోడ్డు మీదకు వచ్చి మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బందితో వాగ్వివాదానికి దిగారు. మోటర్ల ద్వారా తోడుతున్న నీటిని నిలుపు చేసి మోటర్లను తమ నివాసాల వైపు పెట్టి నీళ్లను తోడాలని, అప్పటి వరకు ఇక్కడే బైఠాయిస్తామని ఆందోళన బాట పట్టారు. 'మేం మనుషులం కాదా.. వరద ముంపుతో మేము ఇబ్బందులు పడలేదా, ప్రభుత్వం పేదలపై వివక్ష చూపమందా లేదంటే మీ ఇష్టారాజ్యంగా చేస్తున్నారా' అంటూ సిబ్బందిని నిలదీశారు. అధికారులు చెప్పింది తాము చేస్తున్నామన్నా సిబ్బంది ఎట్టకేలకు మోటర్లను పక్కన పెట్టారు తప్ప అవతల నీటిని మాత్రం తోడలేదు.

ఇటువైపు వదలడం దుర్మార్గం

మహిళలు మాట్లాడుతూ అవుట్‌ఫాల్ డ్రెయిన్ పక్కనే చిన్నపాటి రేకుల షెడ్‌లు వేసుకుని జీవిస్తున్న తమ ఇళ్ల ముందున్న రోడ్డులో వరద నీటిని తోడకపోవడమే కాకుండా ఎక్కడో నీళ్లు తోడి ఇటు వైపు వదలడం దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. ముంపు బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు. ఉన్నవారిని ఒక రకంగా లేనివారిని మరో రకంగా చూస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోయారు. మా ఇళ్ల వెనుక డ్రెయిన్‌లో అడ్డుపడిన చెత్తను తొలగిస్తే నీళ్లన్నీ వెళ్లిపోతాయని, ఆ పని చేయకుండా మోటర్లు పెట్టి తోడించటమేంటని ప్రశ్నిస్తున్నారు. ప్రజలకు అన్ని విధాల సాయం చేస్తున్నామంటూ ప్రభుత్వం ప్రచారానికే పరిమితమైంది తప్ప వాస్తవానికి చేస్తున్నదేమీ లేదని మండిపడ్డారు.

ముంపు బాధితులకు అండగా



వరద బాధితులకు భోజనం వడ్డిస్తున్న అతిథులు



వించిపేట రైల్వే కాలనీలో నిత్యావసరాలు అందజేస్తున్న డాక్టర్ వర్షా పాటిల్

భవానీపురం(విజయవాడపశ్చిమ): బుడమేరు వరద ముంపునకు గురైన బాధితులకు విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి అంబేడ్కర్‌నగర్‌లోని అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్లో పునరావాసం కల్పించిన డాక్టర్ అంబేడ్కర్ యువజన సంఘం మంగళవారం వారికి భోజన వితరణ చేసింది. డాక్టర్ అంబేడ్కర్ యుజన సంఘం కార్యవర్గ సభ్యులు రొంపిచర్ల సత్యనారాయణ, రేమల్లె గోపాలం, మిరియాల నరసింహారావు, దారా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కమర్షియల్ ట్యాక్స్ విశ్రాంత అసిస్టెంట్ కమిషనర్ సుబ్రహ్మణ్యం, న్యూ ఇండియా ఇన్సూరెన్స్ రిటైర్డ్ మేనేజర్ కె.శ్రీనివాసరావు, అడ్వకేట్ కేజేఎస్ ప్రకాష్, జీ గంగాధర్, ప్రసాద్ నిరాశ్రయులకు భోజనం వడ్డించారు. వరద బాధితులకు ఆశ్రయం కల్పించడమే కాకుండా వారికి భోజనంకూడా ఏర్పాటు చేసిన డాక్టర్ అంబేడ్కర్ యువజన సంఘం కార్యవర్గ సభ్యులు అభినందనీయులని అతిథులు కొనియాడారు.

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): దక్షిణ మధ్య రైల్వే ఉమెన్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ విజయవాడ డివిజన్ ఆధ్వర్యంలో వరద ముంపునకు గురైన రైల్వే కాలనీలోని బాధితులకు నిత్యవసరాలు పంపిణీ చేశారు. మంగళవారం ఆర్గనైజేషన్ విజయవాడ డివిజన్ ప్రెసిడెంట్ డాక్టర్ వర్షా పాటిల్ ఆధ్వర్యాన సభ్యులు వించిపేటలోని రైల్వే కాలనీని సందర్శించి బాధితులను పరామర్శించారు. అనంతరం ఆహార పదార్థాలు, నిత్యవసర వస్తువులను అందజేశారు.

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): రాష్ట్రీయ స్వయంసేవ సంఘం ఆధ్వర్యంలో వరద బాధితులకు మంగళవారం నిత్యవసరాల పంపిణీ చేశారు. ఇటీవల వరద ముంపునకు గురైన సింగ్‌నగర్, చిట్టినగర్, భవానీపురం, కండ్రిక, వాంబే కాలనీ, జక్కంపూడి తదితర ప్రాంతాల్లో నష్టపోయిన 150 మంది బాధితులకు అయోధ్యనగర్‌లోని రాష్ట్రీయ స్వయం సేవ సంఘం రాష్ట్ర కార్యాలయంలో పంపిణీ చేశారు. ముఖ్యఅతిథి ఆరోగ్య భారతి జాతీయ కార్యదర్శి డాక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ భారతీయ మజ్దూర్ సంఘ్ అనుబంధ సంస్థ ఇండియన్ పోస్ట్ బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ సహకారంతో రాష్ట్రీయ స్వయంసేవ సంఘం బాధితులకు నిత్యావసరాలు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో భారతీయ మజ్దూర్ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు తంగిరాల రఘురాం, రాష్ట్రీయ స్వయంసేవ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

గణనాథుడికి ప్రత్యేక పూజలు



లారీస్టాండ్‌లోని చవితి వేడుకల్లో వెలంపల్లి తదితరులు



గొల్లపూడి శ్రీనివాసనగర్‌లో..

భవానీపురం(విజయవాడపశ్చిమ): వినాయక చవితి పందిళ్లలో గణనాథుడికి ప్రత్యేక పూజలు చేశారు. లారీస్టాండ్‌లో భవానీపురం లారీ సప్లైర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన నిర్వహించిన వినాయక చవితి ఉత్సవాల్లో వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు వెలంపల్లి శ్రీనివాసరావు, కార్పొరేటర్లు యరడ్ల ఆంజనేయరెడ్డి, ఎండీ ఇర్ఫాన్ పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్న ప్రసాద కార్యక్రమాన్ని వెలంపల్లి శ్రీనివాసరావు ప్రారంభించి వడ్డించారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు బొమ్ము మధు, ఎస్ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

–గొల్లపూడి పంట కాలువ రోడ్డులోని శ్రీనివాసనగర్‌లో శ్రీగణేష్ సేవా సమితి ఆధ్వర్యాన జరుగుతున్న వినాయక చవితి వేడుకల్లో మల్లెలు, తెల్ల చామంతి పూలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానికులు పెద్ద సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు.

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థాన ప్రాంగణంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామి సన్నిధిలో నిర్వహిస్తున్న వినాయక చవితి వేడుకలు మంగళవారం నాలుగో రోజుకు చేరాయి. స్వామి వారిని లక్ష్మీగణపతిగా అలంకరించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు జరుగుతున్నాయని అర్చకుడు విన్నకోట శ్రీనివాసశర్మ, 15వ తేదీ నిమజ్జనం జరుగుతుందని ఈవో వెంకటేశ్వరరావు తెలిపారు.

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని శ్రీ బాలగణపతిస్వామి మంగళవారం శ్రీ హనుమద్ గణపతిగా భక్తులకు దర్శనమిచ్చారు. వన్‌టౌన్ పూజారి వారి వీధిలో కొలువై ఉన్న శ్రీ బాల గణపతిస్వామి ఆలయంలో చవితి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు గ్రంధి శ్రీనివాసరావు, మామిడి లక్ష్మీ వెంకటకృష్ణారావులు పర్యవేక్షించారు. గాయకులు పసుమర్తి శివరామకుమార్ బృందం సుందరకాండ పారాయణం కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీ కృష్ణ ప్రార్థనా సంఘం ఆధ్వర్యంలో భగవద్గీత 18 అధ్యాయాల పారాయణం చేశారు.

వరద ప్రభావిత ప్రాంతాల్లో నీటి సరఫరా పునరుద్ధరణ

పటమట(విజయవాడతూర్పు): వరద ప్రభావిత ప్రాంతాల్లో నగరపాలక సంస్థ ద్వారా సరఫరా అవుతున్న 77, 540 కుళాయి నీటి కనెక్షన్లను పూర్తిస్థాయిలో పునరుద్ధరించామని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద ప్రభావిత ప్రాంతాల్లో పునరుద్ధరణ జరిగిన నీటి కనెక్షన్ల నుంచి వచ్చే నీటిని కేవలం వాడుకునేందుకు మాత్రమే వినియోగించాలని, తాగడానికి కుళాయి ద్వారా వచ్చే నీటిని వినియోగించొద్దని సూచించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో తాగడానికి 229 ట్యాంకర్లతో రోజూ 25 లక్షల లీటర్ల తాగునీటిని సరఫరా చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలు కేవలం ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్న సురక్షిత తాగునీటిని మాత్రమే వినియోగించాలని, ఈ సమాచారాన్ని వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు మైకుల ద్వారా ప్రచారం చేస్తున్నామని వివరించారు. సర్కిల్ వన్ పరిధిలోని కేఎల్ రావు నగర్, ఊర్మిళానగర్, నైజాంగేట్, కబేళా, ఐరన్ యార్డ్, హెచ్‌బీ కాలనీ, సర్కిల్ 2 పరిధిలో ఉన్న సింగ్‌నగర్, వాంబే కాలనీ, నందమూరి నగర్, శాంతినగర్, పాత రాజరాజేశ్వరిపేట, కొత్త రాజరాజేశ్వరిపేటలోని ప్రజలు ఈ నీళ్లను వాడుకోవాలని తెలిపారు.

కుటుంబ సమేతంగా అలరిస్తున్న ఉరుకు పటేల

చిత్ర హీరో తేజస్ కంచర్ల



ఉరుకు పటేల విజయోత్సవ యాత్రలో నగరానికి వచ్చిన హీరో తేజస్, హీరోయిన్ కుష్బూ చౌదరి

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఈ నెల 7న విడుదలైన ఉరుకు పటేల చిత్రం లవ్, కామెడీ, థ్రిల్లర్ అంశాలతో ప్రేక్షకులను అలరిస్తోందని ఆ సినిమా హీరో తేజస్ కంచర్ల అన్నారు. విజయోత్సవ యాత్రలో భాగంగా ఆ చిత్రం యూనిట్ సభ్యులు మంగళవారం నగరానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఎంజీ రోడ్డులోని ఓ హోటల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో హీరో తేజస్ కంచర్ల మాట్లాడుతూ కుటుంబ సమేతంగా చూడదగిన సినిమా అని, యూత్‌కు నచ్చే అంశాలు తమ చిత్రంలో పుష్కలంగా ఉన్నాయన్నారు. దర్శకుడు వివేక్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ఉరుకు పటేల సినిమాను తీసినట్లు తెలిపారు. అనంతరం హీరోయిన్ కుష్బూ చౌదరి మాట్లాడుతూ తన మొదటి చిత్రం ఉరుకు పటేలా విజయవంతం కావడం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ చిత్రంలో నా క్యారెక్టర్ ప్రేక్షకులకు అమితంగా నచ్చుతుందని ఆమె పేర్కొన్నారు. తెలంగాణ యాసలో మాట్లాడే డైలాగులు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయని తెలిపారు.

పూడికతో గోతిలో పడిన ట్రాక్టర్



సితార జంక్షన్ కబేళా రోడ్డులోని గోతిలో ట్రాక్టర్

భవానీపురం(విజయవాడపశ్చిమ): బుడమేరు వరద పనుల్లో నిమగ్నమైన ఒక ట్రాక్టర్ అవుట్‌ఫాల్ డ్రెయిన్‌లో తీసిన పూడిక మట్టిని తీసుకువెళుతూ రోడ్డు పక్కన ఉన్న గుంతలో పడింది. జగ్గయ్యపేట మున్సిపాలిటీ నుంచి వచ్చిన ట్రాక్టర్ విద్యాధరపురం సితార జంక్షన్ (కబేళా రోడ్)లో డ్రెయిన్లలోని చెత్తాచెదారాన్ని తీసుకెళ్తోంది. ఈ క్రమంలో మంగళవారం కబేళా రోడ్డులోని అవుట్‌ఫాల్ డ్రెయిన్‌లో తీసిన పూడిక మట్టిని తీసుకెళ్తుండగా వరద ముంపు కారణంగా మట్టితో కప్పిన గుంతను రోడ్డుఅనుకుని డ్రైవర్ ట్రాక్టర్‌ను నడుపుతుండగా ఉన్నట్లుండి దానిలో కూరుకుపోయింది. అతను ఈ ప్రాంతవాసి కాకపోవడంతో ఇలా జరిగిందని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు.

నవ హారతులిచ్చే దుర్గాఘాట్ పరిశీలన



పంచహారతుల వేదికను పరిశీలిస్తున్న ఈవో రామరావు, వైదిక కమిటీ సభ్యులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): పవిత్ర కృష్ణమ్మకు నవ హారతులిచ్చే దుర్గాఘాట్‌ను దుర్గగుడి ఈవో, వైదిక కమిటీ సభ్యులు, వేద పండితులు మంగళవారం పరిశీలించారు. కృష్ణానదికి భారీ వరద నేపథ్యంలో దుర్గాఘాట్‌లో హారతుల వేదిక ముంపునకు గురైంది. నదికి వరద నీరు తగ్గుముఖం పట్టడంతో మంగళవారం సాయంత్రం ఆలయ అధికారులు ఘాట్‌ను పరిశీలించారు. త్వరలో కృష్ణానదికి హారతులు తిరిగి ప్రారంభించడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని ఈవో రామరావు ఇంజినీరింగ్ అధికారులను, ఆలయ వైదిక కమిటీకి సూచించారు. డీఈవో లీలా కుమార్, ఈఈ లింగం రమ, ఏఈవో ఎన్. రమేష్‌బాబు, స్థానాచార్య శివప్రసాద్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వనాథ జయంతి

మధురానగర్(విజయవాడసెంట్రల్): తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసింది కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ అని ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్య లక్ష్మి కొనియాడారు. స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆమె విశ్వనాథ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ డీఎస్‌వీఎస్ బాలసుబ్రహ్మణ్యం, కేవీ శాంతకుమారి, ఎస్.శ్రీకాంత్ మాట్లాడారు. ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రాంగణంలోని కంచికచర్ల సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా కళాశాలలో మంగళవారం కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వల్లూరు నీరజ విశ్వనాథ సత్యనారాయణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.